జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం





ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
శుక్రవారం 24 జూలై 2026
పేజీలు : 8


# అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలి



జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం హాజీపూర్ మండలాల్లో పర్యటించిన ఆయన ప్రభుత్వ పాఠశాలలు, తహసీల్దార్ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, సామాజిక ఆరోగ్య కేంద్రం, అమృత్--2.0 పనులను ఆకస్మికంగా పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

# దశల వారిగా గ్రామాల అభివృద్ధి ధ్యేయం



దశలవారీగా గ్రామాలను అభివృద్ధి చేయడమే తన ధ్యేయ మని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్‌లి అన్నారు. భైంసా మండలంలోని దేగాం గ్రామంలో 7 లక్షల రూపా యలు నిధుల నిర్మించిన పాఠ శాల ప్రహరీ గోడ, బిజ్జూర్ లింబ గ్రామాల్లో ఒక్కోటి పది లక్షల రూపాయల నిధులతో నిర్మించిన మహిళా సమైక్య భవనాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

## పెండింగ్ లో ఉన్న సిఎంఆర్ బకాయిలను వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలి




ప్రభుత్వానికి ఇవ్వవలసిన సిఎంఆర్ బకాయిలను వెంటనే పూర్తి చేసే ప్రభుత్వానికి అప్పగించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు తెలిపారు.

## బెల్లంపల్లి బీసీ రెసిడెన్షియల్

# బాలికల వసతి గృహంలో అస్వస్థత



ఏడుగురిని జిల్లా ఆసుపత్రికి తరలింపు

పరిస్థితిని సమీక్షించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్

# అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలి





**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, జూలై 23 (ప్రజాజ్యోతి):** జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం హాజీపూర్ మండలాల్లో పర్యటించిన ఆయన ప్రభుత్వ పాఠశాలలు, తహసీల్దార్ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, సామాజిక ఆరోగ్య కేంద్రం, అమృత్--2.0 పనులను ఆకస్మికంగా పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. హాజీపూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం, శుద్ధమైన తాగునీరు అందించాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసీల్దార్ పుష్పలతతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సమీక్షించారు. ప్రజల నుంచి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని, బూత్ స్థాయి అధికారులు వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. అర్హులందరి పేర్లు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రక్రియ వేగవంతానికి బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్లు, యువత సహకారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. భూభారతి, సాదా బైనామా, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కార తీరును కూడా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీల పనితీరు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం చేపట్టాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేసి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, జలసిరి కార్యక్రమం కింద చేపట్టిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రతిరోజూ పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. ఉద్యోగులు, సిబ్బంది విధుల్లో సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. గ్రామపంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పెండింగ్ లో ఉన్న సిఎంఆర్ బకాయిలను వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు**




**జన్నారం,జూలై23(ప్రజాజ్యోతి)** ప్రభుత్వానికి ఇవ్వవలసిన సిఎంఆర్ బకాయిలను వెంటనే పూర్తి చేసే ప్రభుత్వానికి అప్పగించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు తెలిపారు. జన్నారం మండల కేంద్రంలోని పొనకల్ గ్రామంలో గల శ్రీ శివసాయి రాఘవేంద్ర రైస్ మిల్లు,మొర్రిగూడ గ్రామంలోని రాఘవేంద్ర రైస్ మిల్లు రాజరాజేశ్వరి రైస్ మిల్లులను తహశీల్దార్ బక్కయ్య తో కలిసి తనిఖీలు చేశారు. అధికారులతో వరి ధాన్యం కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) పెండింగ్ అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రాములు మాట్లాడుతూ 2025--26 వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించిన పెండింగ్ సిఎంఆర్ బియ్యం సంబంధిత పురోగతిని సమీక్షించారు.రైస్ మిల్లులలో పెండింగ్‌లో ఉన్న సిఎంఆర్‌ను వెంటనే పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలని, నిర్దేశిత గడువులోగా సిఎంఆర్‌ను పూర్తి చేయని పక్షంలో ఆ ధాన్యాన్ని మెరుగైన పనితీరు కనబరిచే ఇతర రైస్ మిల్లులకు తరలించే చర్యలు తీసుకుంటామని రైస్ మిల్లుల యాజమాన్యాలకు సూచించారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. సాదాబైనామా, భూ భారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకొని, రికార్డులను అనుసరించి 60 రోజులకు పైగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బక్కయ్య, గిదావర్ వెంకటేశం లు పాల్గొన్నారు

## ఏరియా జీఎంను కలిసిన ఎస్‌బీఐ నూతన మేనేజర్.



**మందమర్రి, జూలై 23(ప్రజాజ్యోతి) :** సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) యాపల్ శాఖ నూతన బ్రాంచ్ మేనేజర్ బి.కళారామన్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఇటీవల యాపల్ ఎస్‌బీఐ శాఖ బ్రాంచ్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.కళారామన్, జీఎం కార్యాలయంలో ఎన్.రాధాకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జీఎం ఎన్.రాధాకృష్ణ మాట్లాడుతూ, సింగరేణి సంస్థకు, మందమర్రి యాపల్ ఎస్‌బీఐ శాఖకు ఎన్నో సంవత్సరాలుగా విడదీయరాని అవినాభావ సంబంధం కొనసాగుతోందన్నారు.కార్పొరేట్ స్థాయి నుంచి బ్యాంకు యాజమాన్యంతో ఉన్న సత్సంబంధాల వల్ల సింగరేణి కార్మికులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఇదే స్నేహపూర్వక వాతావరణం, పరస్పర సహకారం భవిష్యత్తులోనూ కొనసాగాలని సంస్థకు, కార్మికులకు బ్యాంకు సేవలు మరింత సమర్థవంతంగా అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## పార్డి ( బి )ఆశ్రమ పాఠశాలను సందర్శించిన తహశీల్దార్



**సోనాల, జూలై 23 ( ప్రజాజ్యోతి ):** సోనాల మండలంలోని పార్డి (బి) గ్రామంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను గురువారం తహశీల్దార్ మల్లేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలకు చేరుకున్న ఆయన తరగతి గదులు, విద్యార్థుల హాజరు పట్టిక, వంట గది, మరియు రికార్డులను సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి, వారికి అందుతున్న విద్యాబోధన, మౌలిక వసతులు, మరియు భోజనం నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించడానికి పలు ప్రశ్నలు అడిగి, వారి సమాధానాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

**తహశీల్దార్ మాట్లాడుతూ:**

“విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన విద్య తో పాటు పోషకాహారాన్ని అందించాలి. పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ సిబ్బంది, హాస్టల్ నిర్వాహకులు మరియు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్న రెస్టారెంట్లు, హోటళ్లు , స్విగ్గీ జొమాటో సంస్థలు

ప్రత్యేక కథనం .......

**కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ తెలంగాణా కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్(క్యాట్కో) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. సంపత్ కుమార్**




**మంచిర్యాల, 23, జూలై (ప్రజాజ్యోతి):** ప్రజల ఆరోగ్యాలతో హోటళ్లు, రెస్టారెంట్లు, ఆన్‌లైన్ ఆహార సరఫరా సంస్థలు స్విగ్గీ, జొమాటోలు చెలగాటం ఆడుతున్నాయని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ తెలంగాణా కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ (క్యాట్కో) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. సంపత్ కుమార్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం అయన మాట్లాడుతూ, ఆహార భద్రతా నిబంధనలను బేఖాతరు చేస్తూ అపరిశుభ్రమైన వంటశాలలు, కల్తీ నూనెల వినియోగం, మిగిలిపోయిన ఆహారాన్ని ఫ్రిజ్‌లో నిల్వ చేసి మరుసటి రోజు మళ్లీ వేడి చేసి వినియోగదారులకు అందించడం వంటి చర్యలు ప్రజల ఆరోగ్యాన్ని తీవ్ర ప్రమాదంలోకి నెడుతున్నాయని అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని పలువురు ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లపై ఆహార భద్రతా అధికారుల నిర్వహించిన తనిఖీల్లో తీవ్ర అవకతవకలు వెలుగులోకి రావడం దీనికి నిదర్శనమని ఆయన తెలిపారు. పరిశుభ్రత లేకపోవడం, గడువు ముగిసిన పదార్థాల వినియోగం, కల్తీ నూనెలు, నిల్వ ఆహారాన్ని మళ్లీ వినియోగించడం వంటి అంశాలు బయటపడటంతో సంబంధిత యాజమాన్యాలపై అధికారులు చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు.

**ప్యాకింగ్‌లోనే మొదలవుతున్న మరో ప్రమాదం....**

హోటళ్లలో తయారైన ఆహారం పరిశుభ్రంగా ఉన్నా, దానిని వినియోగదారులకు అందించే విధానంలోనే మరో పెద్ద ప్రమాదం దాగి ఉందని పి. సంపత్ కుమార్ అన్నారు. స్వయంగా పార్సిల్ తీసుకున్నా, స్విగ్గీ, జొమాటో వంటి ఆన్‌లైన్ డెలివరీ సంస్థల ద్వారా ఇంటికి తెప్పించుకున్నా వేడి వేడి కూరలు, సాంబార్, రసం, అన్నం, చపాతీలు, పూరీలు, వడలు, దోశలు, ఇడ్లీలు వంటి పదార్థాలను నిషేధిత పలుచటి ప్లాస్టిక్ కవర్లు, రీసైకిల్ చేసిన నల్లటి ప్లాస్టిక్ కవర్లు లేదా వార్తాపత్రికల్లో చుట్టి ఇస్తున్నారని ఆరోపించారు. వేడి ఆహారం ఈ రకమైన ప్లాస్టిక్‌తో నేరుగా తాకినప్పుడు రసాయనాలు ఆహారంలో కలిసే ప్రమాదం ఉంటుందని, ఇదే విధంగా వార్తాపత్రికలపై ఉండే ప్రింటింగ్ ఇంక్‌లోని సీసం, కాడ్మియం వంటి హానికర లోహాలు ఆహారంలోకి చేరే అవకాశముందని పేర్కొన్నారు. దీర్ఘకాలంలో ఇవి క్యాన్సర్‌తో పాటు ఇతర తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు.

**టీ, కాఫీ, పాలు కూడా ప్లాస్టిక్ కవర్లలో...**

కొన్ని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు వేడి వేడి టీ, కాఫీ, పాలు వంటి పానీయాలను కూడా పలుచటి ప్లాస్టిక్ కవర్లలోనే అందిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇది అత్యంత ప్రమాదకరమైన పద్ధతి అయినప్పటికీ ఇప్పటికీ అనేక చోట్ల కొనసాగుతోందన్నారు. అలాగే వీధి ఆహార విక్రేతలు మిర్చి బజ్జీలు, సమోసాలు, పునుగులు, ఇడ్లీలు, పూరీలు వంటి వేడి పదార్థాలను నేరుగా వార్తాపత్రికల్లో వేసి ఇవ్వడం కూడా ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతోందన్నారు.

**లక్షల్లో వైద్య ఖర్చులు... ప్రజల ప్రాణాలతో ఆట............**

కలుషిత ఆహారం కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతూ లక్షల రూపాయలు వైద్య చికిత్సలకు ఖర్చు చేస్తున్నారని పి. సంపత్ కుమార్ తెలిపారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత, సురక్షిత ప్యాకేజింగ్ వంటి అంశాల్లో నిర్లక్ష్యం ప్రజల ఆరోగ్యంతో పాటు వారి ఆర్థిక పరిస్థితినీ దెబ్బతీస్తోందన్నారు.

**ఆహార భద్రతా చట్టాల ఉల్లంఘన..........**

ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం--2006, సంబంధిత నిబంధనల ప్రకారం నిషేధిత లేదా రీసైకిల్ ప్లాస్టిక్ కవర్లలో వేడి ఆహారాన్ని ప్యాక్ చేయడం చట్టవిరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన హోటళ్లు, రెస్టారెంట్లపై భారీ జరిమానాలు, లైసెన్స్ రద్దు, అవసరమైతే సంస్థలను మూసివేసే వరకు చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు.

**ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల పాత్రపై ప్రశ్నలు.........**

ఆహార భద్రతా నిబంధనల అమలులో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు కీలక పాత్ర పోషించాల్సి ఉన్నప్పటికీ అనేక ప్రాంతాల్లో వారు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించడం లేదని పి. సంపత్ కుమార్ ఆరోపించారు. నిజాయితీగా చర్యలు తీసుకోవాలని ప్రయత్నించే అధికారులను బదిలీ చేయడం లేదా ఇతర ఒత్తిళ్లకు గురిచేయడం జరుగుతోందని అన్నారు. ఇలాంటి అంశాల్లో ఆయా జిల్లాలకు చెందిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల చిరునామా ,మొబైల్ నంబర్లు ప్రదర్శించాలి .ప్రభుత్వం కూడా జానాబాను బట్టి నియామకాలు చేపట్టవలసిన బాధ్యతను తీసుకోవాలి .వారిపై రాజకీయ ఒత్తిడ్లు తీసుకురాకుండా నిక్కచ్చిగా , నిజాయితీగా ప్రజల కోసం పంచి చేసేలాగా చూడాలి .

**వినియోగదారులకు చట్టపరమైన హక్కులు ఉన్నాయి.......**

కలుషిత ఆహారం వల్ల నష్టపోయిన వినియోగదారులు వినియోగదారుల రక్షణ చట్టం--2019 కింద సంబంధిత హోటల్, రెస్టారెంట్ లేదా సేవా సంస్థలపై వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించి నష్టపరిహారం కోరే హక్కు ఉందని ఆయన తెలిపారు. అవసరమైన సందర్భాల్లో చట్టపరమైన శిక్షలు కూడా విధించే అవకాశం ఉంటుందని తెలిపారు .హోటల్ మాత్రమే కాదు... స్విగ్గీ, జొమాటోలదీ బాధ్యత అని అన్నారు .నిషేధిత ప్లాస్టిక్ లేదా రీసైకిల్ కవర్లలో ప్యాక్ చేసిన ఆహారాన్ని వినియోగదారులకు చేరవేస్తే హోటల్ లేదా రెస్టారెంట్‌తో పాటు స్విగ్గీ, జొమాటో వంటి డెలివరీ సంస్థలకూ బాధ్యత ఉంటుందని పి. సంపత్ కుమార్ స్పష్టం చేశారు. పరిశుభ్రమైన, చట్టబద్ధమైన ప్యాకేజింగ్‌తో ఆహారం అందేలా చూడాల్సిన బాధ్యత డెలివరీ సంస్థలదీ సమానంగానే ఉంటుందని తెలిపారు .

**మరి ప్రజలు ఏమి చేయాలి.......?**

ప్రజలు "నాకెందుకులే" అనే ధోరణిని విడిచిపెట్టి తమ హక్కులను వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పార్సిల్ తీసుకున్న ప్రతిసారీ తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, ప్యాకింగ్‌లో లోపాలు కనిపిస్తే పార్సిల్ విప్పేముందు వీడియో తీసి భద్రపరచాలని సూచించారు. అదే భవిష్యత్తులో అధికారులకు ఫిర్యాదు చేయడానికి లేదా వినియోగదారుల కమిషన్‌లో కేసు వేయడానికి కీలక సాక్ష్యంగా ఉపయోగపడుతుందన్నారు.

**క్యాట్కో సహాయం అందుబాటులోనే ఉంటుంది ..............**

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో క్యాట్కో తో పాటు వినియోగదారుల సంఘాలు చురుకుగా పనిచేస్తున్నాయని, బాధితులు వాటిని సంప్రదించి చట్టపరమైన సహాయం పొందవచ్చని తెలిపారు. వివరాల కోసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 9441659144, రాష్ట్ర అధ్యక్షులు 7207110688 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ప్రశ్నించే తత్వమే పరిష్కారం అని అన్నారు .ప్రభుత్వం కల్పించిన చట్టాలను ప్రజలు సమర్థంగా వినియోగించుకుని అన్యాయాన్ని చట్టబద్ధంగా ఎదిరించినప్పుడే మార్కెట్‌లో జరుగుతున్న మోసాలకు అడ్డుకట్ట పడుతుందని క్యాట్కో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. సంపత్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రజల ఆరోగ్యం, వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని ఆయన కోరారు.

## వాహనాల పాత సామగ్రికి 27న బహిరంగ వేలం



**మంచిర్యాల, 23, జూలై (ప్రజాజ్యోతి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు వాహనాలకు సంబంధించిన పాత స్పేర్ పార్ట్స్, టైర్లు, బ్యాటరీలు, ఉపయోగించిన ఇంజిన్ ఆయిల్ తదితర పాత సామగ్రికి ఈ నెల 27న కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన ఆసక్తి గల వ్యక్తులు ఈ బహిరంగ వేలంలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు. వేలంలో పాల్గొనదలిచిన వారు మరిన్ని వివరాల కోసం ఎంటీవో మల్లేశంను 8712656616 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌ను గడువులోగా పూర్తి చేయాలి

**కలెక్టర్ కుమార్ దీపక్**





**మంచిర్యాల, 23, జూలై (ప్రజాజ్యోతి):** జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ దాదాపు 90 శాతం పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను నిర్ణీత గడువుకంటే ముందుగానే పూర్తి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో అనామోలీస్ అధికంగా ఉన్నాయని, డిజిటలైజేషన్ పూర్తయిన అనంతరం సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు చెప్పారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నోటీసులో పేర్కొన్న ధ్రువపత్రాలను సమర్పించడం ద్వారా తమ ఓటు హక్కును కొనసాగించుకోవచ్చని వివరించారు. డబుల్, మరణించిన, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల పేర్లను నిబంధనల ప్రకారం తొలగిస్తామని తెలిపారు. ఇంకా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లను గుర్తించి, బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా బూత్ స్థాయి అధికారులకు ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిజిటలైజేషన్ పూర్తయిన తర్వాత పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడతామని కలెక్టర్ తెలిపారు .ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండలాధికారి శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి బీసీ రెసిడెన్షియల్ బాలికల వసతి గృహంలో అస్వస్థత

**ఏడుగురిని జిల్లా ఆసుపత్రికి తరలింపు**

**పరిస్థితిని సమీక్షించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్**



మంచిర్యాల, జూలై 23 (ప్రజాజ్యోతి): బెల్లంపల్లి మహాత్మ జ్యోతిబా ఫూలే బాలికల బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాలయంలో విద్యార్థినులు వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో అస్వస్థతకు గురైన ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ నాయక్, బెల్లంపల్లి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి, డాక్టర్ అరుణ్‌తో కలిసి పరిస్థితిని సమీక్షించారు. రాత్రి అస్వస్థతకు గురైన 12 మంది విద్యార్థినులను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించగా, ఆరోగ్యం మెరుగుపడటంతో గురువారం ఉదయం డిశ్చార్జ్ చేశారు. అనంతరం మరో ఎనిమిది మంది విద్యార్థినులు వాంతులు, విరేచనాల లక్షణాలతో ఆసుపత్రికి రావడంతో వారికి కూడా చికిత్స అందించారు. వారిలో ఏడుగురిని చిన్నపిల్లల వైద్య నిపుణుల పర్యవేక్షణ కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థినులందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తెలిపారు. అనంతరం అధికారులు రెసిడెన్షియల్ విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థినులకు అందిస్తున్న ఆహార పదార్థాలు, వంటగది, నిల్వ గదులు, తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వాసురామ్, జిల్లా సర్వైలెన్స్ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, ఎపిడెమియాలజిస్ట్ సుమన్ ఆధ్వర్యంలో ఆహార పదార్థాలు, తాగునీటి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. ఆర్బీఎస్కే వైద్య బృందం వైద్యాధికారి డాక్టర్ సుచరిత ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించాలని ఆదేశించారు. మిగిలిన విద్యార్థినులందరికీ నిరంతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వేడి ఆహారం మాత్రమే తీసుకోవడం, శుభ్రమైన తాగునీటిని వినియోగించడం, భోజనం ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవడం, దోమల నివారణ చర్యలు పాటించడం వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. వంటకు వినియోగిస్తున్న బియ్యం, పప్పులు, కూరగాయలు, గుడ్లు, తాగునీటి నాణ్యతను అధికారులు పరిశీలించారు. వంటగది పరిశుభ్రత, వంట పాత్రల శుభ్రత, వంట సిబ్బంది పాటించాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌సీఓ శ్రీధర్, వైద్యులు, మున్సిపల్ సిబ్బంది, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

# దశల వారిగా గ్రామాల అభివృద్ధి ధ్యేయం

**బిజ్జూర్, దేగం లింబ గ్రామాల్లో  అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే**

**ఘనంగా స్వాగతం పలికిన బిజ్జూర్ సర్పంచ్ లక్ష్మీ వెంకట్ రెడ్డి**





**బాసర జూలై 23 (ప్రజాజ్యోతి)** దశలవారీగా గ్రామాలను అభివృద్ధి చేయడమే తన ధ్యేయ మని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్‌లి అన్నారు. బైంసా మండలంలోని దేగాం గ్రామంలో 7 లక్షల రూపాయలు నిధుల నిర్మించిన పాఠశాల ప్రహరీ గోడ, బిజ్జూర్ లింబ గ్రామాల్లో ఒక్కోటి పది లక్షల రూపాయల నిధులతో నిర్మించిన మహిళా సమైక్య భవనాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఉపాధి హామీ పథకంలో సిసి రోడ్లకు, గోదాముల నిర్మాణానికి, మహిళా సమైక్య భవనాల నిర్మాణానికి , పలు అభివృద్ధి పనులకు ఒక్కో గ్రామానికి 50 లక్షల రూపాయల నుండి కోటి రూపాయలకు పైగా నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగడం సంతోషంగా ఉందన్నారు. పది సంవత్సరాల పాలకుల కాలంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబడిందని దశల వారీగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. దేగాం గ్రామంలో విద్యార్థులతో గడిపిన ఎమ్మెల్యే బైంసా మండలంలోని దేగాం గ్రామంలో ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా జెడ్పి హైస్కూల్ విద్యార్థులతో కాసేపు గడిపారు. అక్కడి విద్యార్థులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు.

**లింబ గ్రామంలో జలసిరి కార్యక్రమం ప్రారంభం**

బైంసా మండలంలోని లింబ గ్రామంలో జలసిరి కార్యక్రమాన్ని ప్రారంభించి, నీటి కుంట నిర్మాణాన్ని ప్రారంభించారు. వర్షా బావ పరిస్థితులు తలెత్తిన నేపథ్యంలో వి. బి రాంజీ పథకంలో నీటి కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాల్సిందిగా సూచించారు. ప్రారంభోత్సవ కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యేకు మహిళల ఘన స్వాగతం లభించింది, డప్పు చప్పులతో, పూలు చల్లుతూ స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో డి ఆర్ డి ఓ పి డి విజయలక్ష్మి, ఎంపీడీవో నీరజ్ కుమార్, సీనియర్ నాయకులు సోలంకి భీమ్రావు, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, సర్పంచుల సంఘం బైంసా మండల అధ్యక్షులు పండిత్ రావు పటేల్, బిజెపి మండల అధ్యక్షులు దేగాం సర్పంచ్ సిరం సుష్మ రెడ్డి, స్థానిక సర్పంచులు, లక్ష్మీ వెంకట్ రెడ్డి, లింబ సర్పంచ్ గడపాలే సుష్మ రాణి యశ్వంత్ ఆయా గ్రామాల సర్పంచులు, బిజెపి నాయకులు, మాజీ ఎంపిటిసి లు తదితరులు పాల్గొన్నారు

# కాళేశ్వరం అంశంపై ఢిల్లీలో కేంద్ర మంత్రులతో బీజేపీ నేతల కీలక సమావేశం



**మంచిర్యాల, 23, జూలై (ప్రజాజ్యోతి):** కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యత, అవినీతి ఆరోపణలు, తెలంగాణ రైతులకు సాగునీరు, తాగునీటి సరఫరా, విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై గురువారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో కీలక సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పాల్గొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన నాణ్యతా ప్రమాణాలు, అవినీతి ఆరోపణలు, రైతులకు సాగునీటి అందుబాటు, తాగునీటి సరఫరా, విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీజేపీ ఎంపీలు ఈటెల రాజేందర్, డీకే అరుణ, కొండ విశ్వేశ్వర్ రెడ్డి, ధర్మపురి అరవింద్, గోడం నగేష్, రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్ బాబు, కాటిపల్లి వెంకట రమణ రెడ్డి, ఎమ్మెల్సీ అంజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో తెలంగాణకు సంబంధించిన జలవనరుల అంశాలపై కేంద్ర ప్రభుత్వ దృష్టికి పలు విషయాలను తీసుకెళ్లినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# యువతకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**పార్లమెంట్‌లో నిరసనలో పాల్గొన్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ**



**మంచిర్యాల, 23, జూలై (ప్రజాజ్యోతి):** దేశవ్యాప్తంగా నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలు, ముఖ్యంగా పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలకు నిరసనగా పార్లమెంట్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ ఎంపీలు చేపట్టిన ఆందోళనలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు. పోటీ పరీక్షలు పారదర్శకంగా, ఎలాంటి పేపర్ లీకేజీలు లేకుండా నిర్వహించాలని యువత చేస్తున్న న్యాయమైన డిమాండ్‌కు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తోందన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి యువతను నిరాశపరిచిందని విమర్శించారు. దేశవ్యాప్తంగా నిరుద్యోగులు, పేపర్ లీకేజీల బాధితులు న్యాయం కోసం పోరాడుతుంటే, వారి తరఫున కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో గొంతెత్తుతోందని తెలిపారు .తెలంగాణలో విద్యార్థుల సమస్యలపై రాజకీయాలు చేయకుండా వారికి న్యాయం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులపై కేసులు నమోదు చేయడం, వారిని తప్పుదోవ పట్టించడం సమంజసం కాదని వ్యాఖ్యానించారు. సినీ ప్రముఖులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా యువత సమస్యలపై స్పందించాలని, తమ అభిమానుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. యువతకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని, నిరుద్యోగుల హక్కుల సాధన కోసం తమ ఉద్యమం ఆగదని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు. చివరగా “జై హింద్ -- జై తెలంగాణ” అన్నారు .

# వారాహి దేవి అనుగ్రహం.. భక్తుల కోరికలు తీర్చే దివ్య మాత

## ఆషాఢ గుప్త నవరాత్రుల్లో విశిష్టమైన వారాహి ఉపాసన

## ఉద్యోగం, వివాహం, ఆర్థిక ఇబ్బందుల నివారణకు అమ్మవారి కరుణ

**మంచిర్యాల, 23, జూలై (ప్రజా జ్యోతి :**శ్రీలలితా మహాత్రిపుర సుందరి అమ్మవారి సేనాధిపతిగా, సప్తమాతృకలలో అత్యంత శక్తివంతమైన దేవతగా పూజలందుకునే శ్రీ వారాహి దేవి ఉపాసనకు ఆషాఢ గుప్త నవరాత్రుల్లో విశేష ప్రాధాన్యం ఉంది. ఈ నెల జూలై 15న ప్రారంభమైన గుప్త నవరాత్రులు గురువారం నాటికి తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా శక్తి ఉపాసకులు, భక్తులు వారాహి దేవిని అత్యంత భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తున్నారు.మంచిర్యాల పట్టణం లో కూడా శ్రీ వారాహి దేవి పూజలను భక్తీ శ్రద్దలతో ఘనంగా నిర్వహిసున్నారు .ఈ వారాహి దేవి పూజలు ప్రధానంగా రాత్రి వేళల్లో మాత్రమే నిర్వహించడం శాస్త్రోక్త సంప్రదాయం. రాత్రి సమయంలో అమ్మవారిని ధ్యానించి, మంత్రజపం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేస్తే విశేష ఫలితాలు కలుగుతాయని ఆధ్యాత్మిక గ్రంథాలు పేర్కొంటున్నాయి. గుప్త నవరాత్రులు ముగిసిన అనంతరం కూడా ప్రతి రోజు వారాహి దేవిని భక్తిశ్రద్ధలతో పూజించవచ్చని, అమ్మవారి అనుగ్రహానికి కాలపరిమితి లేదని పండితులు చెబుతున్నారు.


**రౌద్ర రూపంలో రక్షణ.. లలితాంబ రూపంలో కరుణ.....**

వారాహి దేవి బాహ్యంగా రౌద్ర స్వరూపిణిగా దర్శనమిచ్చినా, భక్తుల పట్ల అత్యంత కరుణామయిగా ఉంటుందని పురాణాలు వివరిస్తున్నాయి. దుష్టశక్తులను సంహరించి, సజ్జనులను రక్షించే శక్తిగా ఆమెను భావిస్తారు. ప్రశాంతమైన మనస్సుతో లలితాంబిక రూపంగా అమ్మవారిని ధ్యానించి ఆరాధిస్తే సర్వశుభాలు కలుగుతాయని నమ్ముతున్నారు .

**సమస్యల నివారణకు వారాహి అనుగ్రహము .......**

వారాహి దేవి ఉపాసన వల్ల ఉద్యోగ అవకాశాలు మెరుగుపడటం, వివాహాలు ఆలస్యం కాకుండా జరగడం, కుటుంబ కలహాలు తొలగిపోవడం, అప్పుల బాధల నుంచి విముక్తి, వ్యాపారాభివృద్ధి, కోర్టు వ్యవహారాల్లో అనుకూలత, శత్రు బాధలు తొలగిపోవడం, మానసిక ప్రశాంతత, ధైర్యం, ఆరోగ్యం వంటి అనేక శుభఫలితాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. అమ్మవారి అనుగ్రహం లభిస్తే జీవితంలో ఎదురయ్యే అనేక ఆటంకాలు తొలగి విజయపథంలో ముందుకు సాగుతారని ఆధ్యాత్మిక విశ్వాసం.

**కరుణతో వరాలు ఇచ్చె తల్లి శ్రీ వారాహి దేవి..........**




**పురోహితుడు గట్టు ప్రమద్ శర్మ**

మంచిర్యాల జిల్లాకు చెందిన ప్రముఖ పురోహితులు గట్టు ప్రమద్ శర్మ గత 45 ఏళ్లకు పైగా తన ఇంటి లోనే వారాహి దేవిని ప్రతిష్టించి ప్రతి ఏడాది , ప్రతి రోజు నియమ నిష్టలతో పూజలను చేస్తున్నారు. అమ్మ వారిని నమ్మి పూజ చేసుకునే భక్తులకు కూడా అవకాశం కలిగిస్తున్నారు. ఈ సందర్భంగా పురోహితులు గట్టు ప్రమద్ శర్మ "ప్రజాజ్యోతి " తో మాట్లాడుతూ, వారాహి దేవిని నిజమైన భక్తి, నియమనిష్ఠలతో ఆరాధిస్తే అమ్మవారి దీవెనలు తప్పక లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా రాత్రి సమయంలో దీపారాధన, కుంకుమార్చన, వారాహి అష్టోత్తర శతనామావళి, సహస్రనామ పారాయణం, లలితా సహస్రనామ పారాయణం చేస్తే విశేష ఫలితాలు కలుగుతాయని తెలిపారు.ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న యువత, వివాహం ఆలస్యమవుతున్న వారు, అప్పుల బాధలు, కుటుంబ సమస్యలు, వ్యాపార ఇబ్బందులతో బాధపడుతున్న వారు అమ్మవారిని విశ్వాసంతో ప్రార్థిస్తే ఆమె కటాక్షం లభించి కోరుకున్న కోరికలు నెరవేరుతాయని ఆయన తెలిపారు. భక్తికి ప్రతిఫలం దైవానుగ్రహమే అని అన్నారు. శ్రీ వారాహి దేవి ఉపాసన కేవలం కోరికలు తీర్చుకోవడానికి మాత్రమే కాకుండా, మనస్సుకు ప్రశాంతత, ఆధ్యాత్మిక చైతన్యం, ధర్మబద్ధమైన జీవన విధానాన్ని ప్రసాదిస్తుందని భక్తితో అమ్మవారిని స్మరించే ప్రతి ఒక్కరినీ వారాహి తల్లి తన కరుణాకటాక్షాలతో కాపాడుతూ, సుఖశాంతులు, ఐశ్వర్యం, విజయాలను ప్రసాదిస్తుందని భక్తుల విశ్వాసం అని, ఈ నేపథ్యంలో గుప్త నవరాత్రుల సందర్భంగా వారాహి దేవి ఆలయాలు, పూజా మందిరాల్లో భక్తుల రద్దీ కొనసాగుతోందని వివరించారు .

## పాఠశాలకు ప్లేట్లు పంపిణీ



**బోథ్, జూలై 23 (ప్రజా జ్యోతి)** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లోకమాన్య సొసైటీ సభ్యులు ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ బాలగంగాధర్ తిలక్ నేటి సమాజానికి ఆదర్శప్రాయుడని, ఆయన మార్గంలో ప్రతి ఒక్క విద్యార్థి నడుచుకోవాలని పేర్కొన్నారు. భారత స్వాతంత్రోద్యమంలో ఆయన పోరాట పటిమ చాలా గొప్పదని విద్యార్థులకు వివరించారు. గొప్ప దేశభక్తి నాయకుడు, సంఘసంస్కర్త అని తెలియజేశారు. ఆయన చూపిన బాటలో భవిష్యత్తులో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, అన్నపూర్ణ మహేందర్, విజయ రాజారెడ్డి, మెరుగు భోజన్న, గ్రామపంచాయతీ పాలకవర్గం, ఉపాధ్యాయ బృందం, లోకమాన్య సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మండల అధ్యక్షుడుకి ఘన సన్మానం



**బాసర జూలై 23 (ప్రజా జ్యోతి)** నూతనంగా కాంగ్రెస్ పార్టీ బాసర మండల అధ్యక్షుడిగా మాజీ సర్పంచ్ లక్ష్మణ్ రావ్ నీ నియమించింది మండల అధ్యక్షుడు కి స్థానిక నాయకులు బలక్క గారి పోతన్న. స్థానిక సర్పంచ్ వెంకటేష్ గౌడ్.పల్లె హరిదాస్ యాదవ్. డి నాగేశ్వరరావు. రాజు దేశాయ్ లు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు

## నిర్మల్ లో దివ్య నగర్ అభివృద్ధి కమిటీ ఎన్నిక



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,జులై 23,( ప్రజాజ్యోతి ).** నిర్మల్ పట్టణం లోని దివ్య నగర్ కాలనీ అభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షులుగా కోరిపల్లి రామ్ కిషన్ రెడ్డి, అధ్యక్షులు గా పురస్తు శంకర్, ఉపాధ్యక్షులు గా జి. శ్రీనివాసచారి, కృష్ణారెడ్డి, జనరల్ సెక్రెటరీగా సరసాని మహేందర్ రెడ్డి, కోశాధికారిగా ఇర్రి నరేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి గా జి. రాకేష్ రెడ్డి,జి. అంబాజీ, కార్యవర్గ సభ్యులుగా జుట్టు లక్ష్మణ్, పత్తిరెడ్డి సుదర్శన్ రెడ్డి, అంగ రవి, ధర్మగడ్డ కృష్ణ కుమార్, రాచమల్ల రాజన్న, సుధార్ సింగ్, సలహాదారులుగా రాథోడ్ రాందాస్, కొండ్రు సురేష్, ముసుకు సతీష్ రెడ్డి, ఏలేటి విజయభాస్కర్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. తమపై నమ్మకంతో ఎన్నుకున్నందుకు కాలనీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పార్లమెంట్ సభ్యులు రాహుల్ గాంధీ,నిట్ విద్యార్థుల లాటి చార్జీకి నిరసనగా కాంగ్రెస్ శ్రేణుల ధర్నా

**ఖానాపూర్ జూలై23 (ప్రజా జ్యోతి )** నిట్ విద్యార్థులకు మద్దతుగా నిరసన కార్యక్రమం చేపడుతున్న కాంగ్రెస్ పార్టీ అధినేత పార్లమెంట్ సభ్యులు ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ పట్ల దురుసుగా ప్రవర్తించి లాటి చార్జి చేసి అక్రమ అరెస్టుతో పాటు విద్యార్థుల పై లాటించార్జ్ని నిరసిస్తూ నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు గురువారం తెలంగాణ చౌక్ లో ధర్నా చేపట్టారు కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామ్యంగా వ్యవహరించిందని తీవ్రంగా పలువురు ఖండించారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగిలి శంకర్ పట్టణ అధ్యక్షులు గొర్రె గంగాధర్ కౌన్సిలర్ నిమ్మల రమేష్.జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు అంకం రాజేందర్ ధోనికని దయానంద్ రాస మల్ల అశోక్ షబ్బీర్పాషా జహీర్ అహ్మద్ గుడాల



రాజన్న అమానుల్లా ఖాన్ మదిరే సత్యనారాయణ బాలసంకుల రాజేందర్ శేషాద్రి శ్రీహరి నరసయ్య శ్రీను తో పాటు కార్యకర్తలు నాయకులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు ధర్నాలో పాల్గొన్న నాయకులను పోలీసులు అరగంట పాటు సమయం ఇచ్చి ఎస్సై రాహుల్ గైక్వాడ్ ధర్నా వీరమింపచేశారు

## రోడ్డు ప్రమాద బాధితురాలి పరామర్శ

**10 వేల నగదు ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్**



**ఖానాపూర్ జూలై 23 (ప్రజా జ్యోతి)** ఖానాపూర్ మండలం సోమరి పేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త రాజేశ్వర్ సతీమణి రాజమణి కి రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న ఖానాపూర్ శాసనసభ్యులు, నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ నిర్మల్ జిల్లా కేంద్రంలోని దేవేందర్ రెడ్డి హాస్పిటల్ కి వెళ్లి పరామర్శించి ధైర్యం కోల్పోద్దని అన్నారు. హాస్పిటల్ డాక్టర్ల తోటి మాట్లాడి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. అనంతరం పదివేల రూపాయల ఆర్థిక సాయం అందజేసారు ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కొడారి నరేష్, బిక్కు నాయక్ లచ్చన్న తదితరులు ఉన్నారు.

## విదేశాలలో ఉద్యోగం అని చెప్పి మోసం చేసిన ఏ జెం ట్, సహకరించిన వ్యక్తి, ఇద్ద రి అరెస్టు, రిమాండ్

**బాధితున్ని మోసం చేసి ఆరు లక్షల 50 వేలు వసూలు**

**విడతలవారీగా లక్షల్లో వసూలు చేసిన నిందితులు**

**ఇంద్రవెల్లి ఎస్ఐ ఈ సాయన్న**



**ఇంద్రవెల్లి, జూలై 23, (ప్రజా జ్యోతి)** నిందితులు ఎ1) అనుపురపు శ్రీనివాస్ గౌడ్ (45) శంకర్,జయ దేవ మాన్ పవర్ కన్సల్టెన్సీ ఏజెంట్, వాల్గొండ, జగిత్యాల జిల్లా. 2) ఇస్లావత్ ప్రభాకర్ సరీరం,వాల్గొండ, జగిత్యాల

**వివరాలలో**

విదేశాలలో ఉద్యోగం ఇప్పి స్తానంటూ మోసం చేసిన ఏ జెంట్, అతనికి సహకరించిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఇంద్రవెల్లి ఎస్ఐ ఈ సాయన్న తెలిపారు. ఈ సందర్భం గా వివరాలను తెలియజే స్తూ ఇంద్రవెల్లి మండలం లాల్టేకిడి హీరాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ సుకేంద్ర అనే వ్యక్తి విదేశాలలో ఉద్యోగం చేయాలని ఆశతో ఏజెంట్ శ్రీనివాస్ గౌడ్ ను సంప్రదించగా అతను ఇజ్రాయిల్ దేశంకి వెళ్లడానికి 4,30,000 ఖర్చు అవుతుందని తెలపడం జరిగింది, అదేవిధంగా ఇస్లా వత్ ప్రభాకర్ అనే వ్యక్తి ద్వారా తనకు పూర్తి నమ్మకం కలిగించేలా ప్రోత్సహించడం జరిగిందని తెలిపారు. వీరిని నమ్మి అతను విడతలవారీ గా 4,32,000 వేలను శ్రీనివాస్ కు ఇవ్వడం జరిగింద ని తెలిపారు. డబ్బులు తీసుకుని ప్రతిసారి బాధితులని తిప్పుతూ మోసం చేయడం జరిగింది అంతేకా కుండా అదనంగా ఖర్చవుతుం దని విడతలవారీగా ఇతని వద్ద నుండి మొత్తం 6,51, 8 00 వసూలు చేసి మోసం చేయడం జరిగింది. రెండుసార్లు రాజీవ్ గాంధీ ఇంటర్నే షనల్ ఎయిర్పోర్ట్కి వెళ్లి సరైన పత్రాలు లేని సందర్భంగా తిరిగి బాధితుని వెనక్కి పంపించడంతో అతను పెద్దల సమక్షంలో 6,40,000 తిరిగి ఇస్తానని ఒప్పుకొని, తిరిగి ఇవ్వకుండా మోసం చేయడంతో కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో గురు వారం ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో, ఇంద్ర వెల్లి ఎస్ఐ ఈ సాయన్న బృందం వారిని పట్టుకుని కోర్టులో హాజరు పరచగా వారికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలను ఇవ్వడం జరిగిందని తెలిపారు. విదేశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తా మంటూ మోసం చేసే నకిలీ ఏజెంట్లను నమ్మవద్దని,అ ప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

# సింగరేణి సంస్థ రాష్ట్ర విద్యుత్ రంగానికి, పారిశ్రామిక అభివృద్ధికి కీలకమైన సంస్థ

**ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచుతూ ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలి**

**తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క**

**సింగరేణి అభివృద్ధే లక్ష్యం.. ఉత్పత్తి పెంపు, భవిష్యత్ ప్రణాళికలపై భట్టి సమీక్ష**



**మంచిర్యాల, 23, జూలై (ప్రజాజ్యోతి):**సింగరేణి సంస్థ రాష్ట్ర విద్యుత్ రంగానికి, పారిశ్రామిక అభివృద్ధికి కీలకమైన సంస్థగా నిలవాలంటే ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచుతూ ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సూచించారు. ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క గురువారం సింగరేణి సంస్థలో అతిపెద్ద బొగ్గు గనిగా పేరొందిన సత్తుపల్లి ఏరియాలోని జేవీఆర్ ఓసీ--2 ఓపెన్‌కాస్ట్ గనిని సందర్శించి క్వారీ ఆపరేషన్లు, మైనింగ్ ప్లాన్‌ను వ్యూ పాయింట్ వద్ద నుంచి పరిశీలించారు. గని పనితీరు, బొగ్గు తవ్వకాల విధానం, భవిష్యత్ మైనింగ్ ప్రణాళికలపై అధికారులతో సమగ్రంగా సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా గని జీవితకాలం, వార్షిక బొగ్గు ఉత్పత్తి, నిల్వలు, భవిష్యత్ ఉత్పత్తి లక్ష్యాలు, యంత్రాల వినియోగం, భద్రతా ప్రమాణాల అమలు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేవీఆర్ ఓసీ--2 ప్రాంగణంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సింగరేణి సంస్థ భవిష్యత్ అభివృద్ధికి సంబంధించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఉత్పత్తి పెంపుతో పాటు భద్రత, పర్యావరణ పరిరక్షణ, ఆధునిక మైనింగ్ విధానాల అమలు, ఉద్యోగుల సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేసే దిశగా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఉప ముఖ్యమంత్రి చేసిన సూచనల మేరకు సంస్థ అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్, ఐఏఎస్, సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, ఐఏఎస్, తెలంగాణ జెన్‌కో సీఎండీ డాక్టర్ హరీష్, ఐఏఎస్, సింగరేణి డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పోట్రు, ఐఏఎస్, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., ఐఏఎస్, సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ (పీ అండ్ పీ) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం. తిరుమలరావు, ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్నతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జైల్ భరోను విజయవంతం చేయాలి

**సీఐటీయు నాయకులు**




**మంచిర్యాల, 23, జూలై ( ప్రజా జ్యోతి:**క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ఆదివాసీలకు వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య విమర్శించారు.మంచిర్యాల పట్టణంలోని పూలే భవన్‌లో గురువారం సీఐటీయు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల రాజారెడ్డి, పైళ్ల ఆశయ్య, రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్ నాయక్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మికులు స్వాతంత్ర్యానికి ముందే పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను లేబర్ కోడ్స్ ద్వారా బలహీనపరుస్తోందని ఆరోపించారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, పని గంటల విషయంలో కార్మికుల కు అన్యాయం జరుగుతోందన్నారు.అమెరికా, బ్రిటన్, న్యూజిలాండ్ తదితర దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చు కోవడం వల్ల విదేశీ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు పెరిగి, దేశీయ రైతులకు గిట్టుబాటు ధరలు లేక తీవ్ర నష్టాలు ఎదురవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా పత్తిపై దిగుమతి సుంకం తగ్గించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీన పరిచే చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపడుతోందని, రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం



మోపాలని చూస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించేందుకు సమైక్య ఉద్యమం అవసరమని పిలుపునిచ్చారు. విద్యుత్ సవరణ బిల్లుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నా లు జరుగుతున్నాయని, స్మార్ట్ మీటర్లు, ముందస్తు టారిఫ్ వసూళ్లు, ఉచిత విద్యుత్ రద్దు వంటి చర్యలు రైతులపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు ప్రజలు ఉద్యమాల్లో భాగస్వాము లు కావాలని కోరారు.దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు పిలుపు నిచ్చారు.ఈ సమావేశంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు గోమాస ప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శులు సాంబారి వెంకటస్వామి, దాగం రాజారాం, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మణ్, రఫియా, దేవదాస్, రవి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బోడేంకి చందు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికరపు అశోక్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్ర పున్నం, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ శ్రీకాంత్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్కే మోహన్‌తో పాటు బ్రహ్మయ్య, సవిత, జయ, మధునమ్మ, సరిత, రబియా, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రం పరిశీలన



**బోథ్, జూలై 23 (ప్రజా జ్యోతి)**ఆదిలాబాద్ జిల్లా పద్మశాలి సంఘ అధ్యక్షు ప్రధాన కార్యదర్శి ఎన్నికలు ఆగస్టు 9న జరగనున్న నేపథ్యంలో బోథ్ పట్టణంలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాన్ని సంఘం సభ్యులు గురువారం పరిశీలించారు. మండల కేంద్రంలోని నాగభూషణం స్కూల్లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ స్టేషన్‌ను సందర్శించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లపై వారు చర్చించారు. ఈ సందర్భంగా బోథ్ పట్టణ పద్మశాలి సంఘ అధ్యక్షులు మేరుగు భోజన్న మాట్లాడుతూ, ఎన్నికలను విజయవంతం చేసేందుకు పద్మశాలి సంఘ సభ్యులందరూ సహకరించాలని కోరారు. ఆగస్టు 9న జరిగే ఎన్నికల్లో అర్హులైన ప్రతి సభ్యుడు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకుని సంఘ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ టౌన్ పద్మశాలి సంఘ సభ్యులతో పాటు బోథ్ పట్టణ పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన మున్నూరు కాపు రాష్ట్ర యూత్ నాయకుడు శ్రీపతి సురేష్‌కు పరామర్శ



**మంచిర్యాల, 23, జులై (ప్రజా జ్యోతి):** రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న రాష్ట్ర మున్నూరు కాపు యూత్ నాయకుడు శ్రీపతి సురేష్‌ను ఆయన నివాసంలో రాష్ట్ర మున్నూరు కాపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగం రాజారాం, కార్పొరేటర్ శ్రీపతి వాసు, రాష్ట్ర అధికార ప్రతినిధి బాస్కర్ల రాజేశం కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా సురేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, ప్రమాద వివరాలపై ఆరా తీశారు. ఆయన త్వరగా పూర్తిగా కోలుకుని తిరిగి సామాజిక సేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.

## బాసర ఎత్తిపోతల పథకం కమిటీ చైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు



**బాసర జూలై 23 (ప్రజా జ్యోతి)**బాసర మండల రైతుల, గ్రామస్తుల సమక్షంలో స్థానిక రైతు వేదికలో గిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ గా ఎన్నుకోవడం జరిగింది.. లిఫ్ట్ ఇరిగేషన్ కమిటీ చైర్మన్ గా జంగం మల్లన్న , వైస్ చైర్మన్ గా గోసుల రాజు, షేక్ అయుబ్, కోశాధికారిగా నానం విజయ్ బిద్దూరు రమేష్ జనరల్ సెక్రటరీ గా వినాయక్ రావు, గొరోళ్ళ రాములు, జాయింట్ సెక్రటరీగా కుబిరోల్ల దేవేందర్.. ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.. రైతులకు నీటిపారుదల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు అండదండలుగా ఉంటామని ఈ సందర్భంగా నూతన లిఫ్ట్ ఇరిగేషన్ అధ్యక్షుడు జంగం మల్లన్న తెలిపారు.. సర్పంచి వెంకటేష్ గౌడ్, బాసర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దయాల లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ సతీష్వరరావు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ నూకం రామారావు, గ్రామ రైతులు గిరిమన్న గారి గంగారావు, బొట్టు శంకర్, జంగం రాజేందర్, బలగం దేవేందర్, కొట్టే ఎల్లప్ప, అంబకంటి చిన్నన్న, బాల చిన్న మలకన్న, బాల పెద్ద మల్లన్న యాదవ్, జిద్దు మల్లయ్య, కరివి మలేష్ యాదవ్, బాలక్క గారి పోతన్న, జంగం రాజేందర్, మాజీ ఉపసర్పంచి లాల్మీయా, కొండూరి ప్రతాప్ రావు, సంజీవరావు, చిట్టెపు రామారావు, పిరన్ రావు,

# సోన్ మండల తహసిల్దార్ కి వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

### ప్రజాస్వామ్యమా? నిరంకుశత్వమా?: విద్యార్థులపై లాఠీచార్జి, రాహుల్,ద

### ప్రియాంక గాంధీల అక్రమ అరెస్టులపై వెల్లువెత్తుతున్న ఆగ్రహం!



**సోన్, జూలై 23(ప్రజా జ్యోతి) :** సోన్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తహసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా దేశంలో ప్రజాస్వామ్య విలువలు రోజురోజుకూ క్షీణిస్తున్నాయనే దానికి ఢిల్లీ వేదికగా జరుగుతున్న తాజా పరిణామాలే నిదర్శనంగా నిలుస్తున్నాయనీ నిర్మల్ డీసీసీ అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. నీట్ (నీట్ ) పేపర్ లీకేజీలు, విద్యావ్యవస్థలో అవకతవకలకు వ్యతిరేకంగా తమ భవిష్యత్తు కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు అత్యంత అమానుషంగా లాఠీచార్జి చేయడం, కన్నీటి వాయువు ప్రయోగించడం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ అణచివేతకు వ్యతిరేకంగా, విద్యార్థులకు అండగా నిలిచిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ ) అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అక్రమంగా అరెస్టు చేసి, ఈడ్చుకెళ్లడం పట్ల ప్రజలు, విద్యార్థి లోకం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోందనీ తెలిపారు.

**విద్యార్థులపై ఉక్కుపాదం.. అమానుష లాఠీచార్జి: తాహెర్ బిన్ హందాన్**

దేశ భవిష్యత్తుకు వెన్నెముక లాంటి విద్యార్థులు విద్యావ్యవస్థలోని లోపాలను సరిదిద్దాలని, తమకు న్యాయం చేయాలని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టారు. అయితే, వారి సమస్యలను ఆలకించి పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం, పోలీసులను ముందుపెట్టి విద్యార్థులపై ఉక్కుపాదం మోపిందనీ అన్నారు. విచక్షణారహితంగా లాఠీలతో కొట్టడం వల్ల ఎంతోమంది విద్యార్థులు తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల పాలయ్యారనీ తెలిపారు. "గాయపడిన విద్యార్థులు మన పిల్లలే, దేశ భవిష్యత్తే, వారిపై ఇలాంటి దాడులు చేయడం నేరం" మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు మాజీ ఎమ్మెల్యే ఆరే మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొయినుద్దీన్, స్థానిక సర్పంచ్ కృష్ణ ప్రసాద్ రెడ్డి, రాజా నరసింహ రెడ్డి, వినోద్, శ్రీనివాస్ గౌడ్, ప్రేమ్ , అజహర్, కాంతయ్య, సతీశ్ రెడ్డి, అనిల్, వెంకట రమణ, జగన్, గుర్రం రాము, కే. లింగన్న, బి లింగన్న, శ్రీనివాస్ రెడ్డి, రమేష్ రెడ్డి, ప్రసాద్, శ్రీకాంత్, నర్సయ్య, మహేందర్ తదితర కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.


## పారదర్శకంగా భూ సర్వే సేవలు అందించాలి

**--లైసెన్స్డ్ సర్వేయర్లు నిబద్ధతతో పనిచేయాలి: అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు**



**నేరడిగొండ, జులై 23 (ప్రజా జ్యోతి):** జిల్లాలో భూ సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేస్తూ, ప్రజలకు పారదర్శకమైన, నాణ్యమైన సేవలు అందించడానికి లైసెన్స్డ్ సర్వేయర్లు నిబద్ధతతో పనిచేయాలని అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు సూచించారు. సర్వే, సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏడీ ప్రభాకర్‌తో కలిసి రెండేళ్ల కాలపరిమితి గల అధికారిక ల్యాండ్ సర్వే లైసెన్స్ పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ఎలాంటి వివాదాలకు తావులేకుండా ప్రభుత్వ నిబంధనలు, సాంకేతిక ప్రమాణాల ప్రకారం ఖచ్చితత్వంతో సర్వేలు నిర్వహించాలని కోరారు. రైతులు, భూ యజమానుల విశ్వాసాన్ని నిలబెట్టేలా సేవలు అందించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 13 మందికి లైసెన్సులు మంజూరు కాగా, నేరడిగొండ మండలం నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. దర్బా తండా: ఆడే మహిపాల్ (లైసెన్స్ నం. ఏ డి బి -111/2026) నేరడిగొండ: ఆడే సాయికిరణ్ (లైసెన్స్ నం. ఏ డి బి-112/2026) బోరిగాం:రాథోడ్ సందీప్ (లైసెన్స్ నం. ఏ డి బి-113/2026) లైసెన్సులు పొందిన అభ్యర్థులు జిల్లా యంత్రాంగానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన సేవలు అందిస్తూ బాధ్యతాయుతంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

## సోనాలకు గర్వకారణం: మానవ హక్కుల జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక




**సోనాల, జూలై 23 ( ప్రజాజ్యోతి ):** సోనాల మండల కేంద్రానికి చెందిన కసిరే పురుషోత్తం మానవ హక్కుల కమీషన్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. గ్రామానికి చెందిన వ్యక్తికి ఈ కీలక బాధ్యతలు దక్కడంతో స్థానిక ప్రజలు, నాయకులు తీవ్ర సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో మానవ హక్కుల పరిరక్షణకు, అన్యాయానికి గురైన బాధితులకు న్యాయం జరిగేలా శ్రమిస్తానని స్పష్టం చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమ ప్రాథమిక హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, హక్కుల పట్ల అన్యాయం జరిగితే ఎవరికైనా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సోనాల వాసికి ఈ అరుదైన గౌరవం దక్కడంతో గ్రామస్తులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అభినందనల వర్షం కురిపిస్తున్నారు.

## బైండోవర్ నిబంధనలు ఉ ల్లంఘించిన వ్యక్తికి రూ.50 వేలు జరిమానా

అక్రమంగా మద్యం, అనుమ తులు లేకుండా కల్తీ కళ్ళు విక్రయిస్తున్న వ్యక్తిపై చర్య లు

బైండోవర్‌లో ఉన్నవారు ని బంధనలు తప్పనిసరిగా పా టించాలి

ఇచ్చోడ ఎస్హెచ్ఓ కె నరేష్ కుమార్




**ఇచ్చోడ, జూలై 23, (ప్రజా జ్యోతి)** ఇచ్చోడ మండలం సిరిచెల్మె గ్రామానికి చెందిన నిందితుడు సురేందర్ గౌడ్ అనే వ్య క్తి గతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కేసులో నిందితుడుగా ఉన్న సందర్భంలో అతనిని బైండోవర్ చేయడంతో, నిబంధనలు ఉల్లంఘించి మల్లీ అనుమ తుల్లేకుండా కల్తీ కళ్ళు విక్ర యిస్తున్న కేసులో పట్టుబడ్డాడు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించి తిరిగి అదే తరహా నేరానికి పాల్పడినట్లు గుర్తించిన ఇచ్చోడ పోలీసులు అతనిపై చర్యలు చేపట్టి, బైండోవర్ నిబంధనల ఉ్లంఘన కు సంబంధించి ఇచ్చోడ తహసీల్దార్ (ఎంఆర్ ఓ) కార్యాలయానికి నివేదిక పంపారు. దీనిపై విచారణ అనంతరం సంబంధిత నిందితుడికి తహసిల్దార్ రూ. 50,000 జరిమానా విధించగా, ఆ మొత్తాన్ని చెల్లించినట్లు ఇచ్చోడ ఎస్హెచ్ఓ కె నరేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బైండోవర్‌లో ఉన్న వ్యక్తులు నిబంధనలను తప్పని సరిగా పాటించాలని, వాటిని ఉల్లంఘించి మళ్లీ నేరాలకు పాల్పడితే జైలు శిక్షతో పాటు భారీ జరిమానా కూడా విధించబడుతుందని హె చ్చరించారు. ప్రజలు శాంతి భద్రతలకు భంగం కలిగించే లేదా చట్టవిరుద్ధ కార్యకలా పాలకు పాల్పడకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

## సర్ సమీక్ష సమావేశం



**బోథ్, జూలై 23 (ప్రజా జ్యోతి)** స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సర్ కార్యక్రమంపై ఎమ్మార్వో సుభాష్ చంద్ర గురువారం కాంగ్రెస్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోథ్ మండలంలో సర్ కార్యక్రమం గురువారం నాటికి 100% పూర్తయినట్టుగా పేర్కొన్నారు. అలాగే బోథ్ నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రంలోనే 5వ స్థానంలో కొనసాగుతుండటం అభినందించదగ్గ విషయమని తెలిపారు. ఈ విజయానికి సహకరించిన అధికారులు, సిబ్బంది, బీఎల్ఓలు, ప్రజాప్రతినిధులందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మెరుగు భోజన్న, ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మాజీ ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, బి ఎల్ ఏ 2 సూపర్వైజర్, ఎస్.కె మొహమ్మద్, షేక్ అబూద్, అచ్యుత్ రెడ్డి, రహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో అరెస్టులపై కాంగ్రెస్ నేతల నిరసన.



**బాసర జూలై 23 (ప్రజాజ్యోతి)** ఢిల్లీలో లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీ తదితరులను అరెస్టు చేయడానికి ఖండిస్తూ కాంగ్రెస్ నేతలు కదిలివచ్చారు. బాసర మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రధాన రహదారిపై సర్పంచ్ వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభు త్వాన్ని నిలదీస్తూ ప్లకార్డులతో శాంతియుత నిరసన నిర్వహించా రు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు శాంతియుత నిరసన చేపట్టారు. మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. అనంతరం సీఐ దీపక్ ఏఎస్ఐ,పోలీసులు కాంగ్రెస్ పార్టీ నాయకుల వద్దకు చేరుకొని నిరసనను విరమింపజేశారు.

# ఓటర్లను కాపాడుకుంటేనే నాయకులు గా ఎదిగేది



"సర్" పై బిఎల్ఎ సూపర్వైజర్ ముఖ్య నాయకుల సమావేశంలో

పార్లమెంటు ఇంచార్జ్ ఆరెపల్లి మోహన్ వెల్లడి

**ఖానాపూర్ జూలై 23( ప్రజా జ్యోతి )**ఓటర్లను కాపాడుకుంటేనే నాయకులు ఎదుగుతారని కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎ సూపర్వైజర్ ముఖ్య నాయకుల ఎస్ ఐ ఆర్ సమావేశం ఖానాపూర్ లో గురువారం జరిగింది సర్ ప్రక్రియలో భాగస్వాములై 100% నమోదుప్రక్రియను పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ అదిలాబాద్ పార్లమెంటు ఎస్ ఐ ఆర్ ఇన్చార్జ్ ఆరేపల్లి మోహన్ సమావేశంలో పార్టీ బిఎల్ఎ ముఖ్య నాయకులు కార్యకర్తలను ఉద్దేశించి సూచించారు ఈ కార్యక్రమం నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ అధ్యక్షతన క్యాంపు కార్యాలయంలో జరగగా ఖానాపూర్ పాత తాలూకా ఖానాపూర్ కడెం దస్తూరాబాద్ పెంబి మండలాలకు చెందిన బిఎల్ఎ టు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నార అతిథులుగా కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి టి పి సి సి కార్యదర్శి ఎంబటి రాజేశ్వర్ డిసిసి ఉపాధ్యక్షులు రాజుల సత్యం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దుర్గాభవాని హాజరయ్యారు ఈ సందర్భంగా ఆరెపల్లి మోహన్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంపైఅధికారం కోసం తహతహలా డుతుందని అన్నారు కాంగ్రెస్ సానుభూతి ఓట్లపై సర్ ప్రోగ్రాం లో ఓట్లను తొలగింప చేయడానికి కుట్ర పన్నిందని ఆరోపించారు కాంగ్రెస్ పార్టీ పార్టీ కార్యకర్తలు నాయకులు సమిష్టిగా ఉంటూ గ్రామాల్లో సర్ ప్రక్రియ లో ఏ ఒక్క ఓటరు తప్పిపోకుండా నమోదు చేయించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు గ్రామాల్లో ఓటర్లు నమోదు ఎంతమంది వలస వెళ్లిన వారెంత మంది చనిపోయిన వారు ఎంతమంది ఒకటికి రెండు చోట్ల ఉన్న ఓటర్లను గుర్తించి క్షుణ్ణంగా గమనించి ఏ ఒక్క ఓటరు తప్పిపోకుండా నమోదు చేయించాలన్నారు గ్రామాల్లో ఉన్న బిఎల్ఎ లు గ్రామంలో ఎంతమంది ఓటర్లను ఆన్లైన్నమోదు చేశారో ప్రతిరోజు పర్యవేక్షించా లని సూచించారు సర్ కార్యక్రమం పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లు సైతం ప్రతిరోజు ఓటర్ నమోదుపై సమీక్షిస్తున్నారని వచ్చే ఆగస్టు 3 వరకు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు గ్రామాల్లోనే ఉండి బాధ్యతాయుతం గా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు సర్ ప్రక్రియలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలపై పార్టీ చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అంకం రాజేందర్ దొనికేని దయానంద్ ఆత్మ కమిటీ చైర్మన్ తోటసత్యం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగిలి శంకర్ బొడ్డు గంగన్న గుడిసె రమేష్ కౌన్సిలర్ నిమ్మల రమేష్ తోపాటు పట్టణ అధ్యక్షులు గొర్రె గంగాధర్ పాత ఖానాపూర్ తాలూకాకు చెందిన నాలుగు మండలల బి ఎల్ ఎ టు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మాజీ మంత్రి జోగు రామన్న




**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 23, (ప్రజా జ్యోతి)**తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్ ఉ ద్యోగులు తమ సమస్యల ను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జోగు రామన్న దృష్టికి తీసుకువచ్చారు. 2017, 2 021 పీఆర్సీ బకాయిలు, లీ వ్ ఎన్ క్యాష్మెంట్, ఇతర ఏరియర్లు ఇప్పటికీ అందక విశ్రాంత ఉద్యోగుల కుటుం బాలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నాయని వినతి పత్రంద్వారా వివరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జోగు రామన్న, రిటైర్డ్ ఉద్యో గుల సమస్యలను బీఆర్ ఎస్ పార్టీ తరపున కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి అసెంబ్లీలో ప్రస్తావించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శిస్తూ, వారి సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో నిరసన కార్యక్రమాలు చేపట్టను న్నట్లు తెలిపారు.

## నీట్ పేపర్ లీక్ ఘటన పై మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన ధర్నా



**లక్ష్మణ చాంద, జూలై 23 (ప్రజా జ్యోతి)** మండల కేంద్రంలో నీట్ పేపర్ లీక్ ఘటనను నిరసిస్తూ రాహుల్ గాంధీ అరెస్టును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోండ్ర నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో గురు వారం రోజున ధర్నా నిరసన కార్యక్రమాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చేపట్టారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని నీటి పరీక్ష లీకేజీకి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని అలా చేయకపోతే ప్రజాగ్రహం తప్పదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతాం యువత భవిష్యత్తు కోసం పోరాడుతామని విద్యార్థులకు న్యాయం చేయడంతో పాటు ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసిల్దార్ సరితకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లోల సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొండ నరేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ్ భీమ్ రెడ్డి, వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, నాయకులు రఘునందన్ రెడ్డి, రామ్ రెడ్డి, ఓస రాజేశ్వర్, కేశం రమేష్, గురాల లింగారెడ్డి, బిట్లింగు రజినీకాంత్, మైనార్టీ అధ్యక్షులు అస్గర్, గణేష్, నారా గౌడ్, సిరాజుద్దీన్, సంఘం వెంకట్ రాజు, బూసి మహేష్, సుదర్శన్, పసుపుల నరేష్, కల్లెడ భూమన్న, గంగయ్య, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల సవరణ ఎస్ ఐ ఆర్ సాకుతో తెలంగాణలో పాగా వేసేందుకు చూస్తున్న బిజెపి

### అసలైన ఓటరుకు ముప్పు రాకుండా చూడాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలదె

### కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి

**ఖానాపూర్ జూలై 23 (ప్రజా జ్యోతి )** కేంద్ర బిజెపి మోదీ సర్కార్ రాష్ట్రాలను తమ ఆధీనంలో తీసుకోవడానికి ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో పాగా వేయడానికి పక్క ప్రణాళికతో చేస్తున్నదే సర్ ప్రోగ్రామ్ అని కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాల చారి అన్నారు గురువారం సాయంత్రం నిర్మల్ జిల్లా ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ ఎలక్షన్ కమిషన్ చేపట్టిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియ సముచితమే అయిన వలస పోయిన చనిపోయిన ఓటర్లు పోతే తప్పేమీ లేదని అసలైన ఓటర్లను కాపాడుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తల పై ఉందని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి అన్నారు ఇటీవల కొన్ని రాష్ట్రాల్లో ఈ సర్వే ద్వారానే లక్షలాది ఓట్లను గల్లంతు చేసి అధికారంలోకి వచ్చిన విషయాన్ని కాంగ్రెస్ వాదులు మర్చిపోరాదని అన్నారు సున్నితమైన ఈ విషయాన్ని గమనించి తమకు సంబంధించిన ఓట్లు గల్లంతు కాకుండా పార్టీలపరంగా కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎ 2లుగా నియమించడం జరిగిందని అన్నారు పదేళ్ల కేంద్రంలో ఉన్న మోడీ సర్కార్ ఏ రాష్ట్రాల్లో ఏ జిల్లా ప్రాంతాలు తమ వైపు ఉన్నాయో తెలుసుకొని ఆ ప్రాంతాలఓట్లను తారుమారు చేసే దిశలో ప్రయత్నిస్తుందని ఆరోపించారు దీనికి బీహార్ బెంగాల్ రాష్ట్రాలే ఉదాహరణ అన్నారు ఓటు వేయకుంటే ఆ వ్యక్తి చనిపోయినట్లేనని గ్రామాల్లో ఉన్న నినాదాన్ని దృష్టిలో పెట్టుకొని సరైన ఓటర్కు అన్యాయం జరగకుండా చూడాలని కార్యకర్తలకు




సూచించారు ఈ ఓటర్ల సర్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా కాంగ్రెస్ పార్టీ తీసుకుందని దీనికి ముఖ్యమంత్రి స్థాయి నుండి ఉప ముఖ్యమంత్రి మంత్రులు ఎమ్మెల్యేలతో పాటు ముఖ్య రాష్ట్ర నాయకులు నలు దిక్కుల పరిశీలకులుగా ఇన్చార్జీలుగా నియమిస్తున్న కార్యక్రమాన్ని ఆషామాషీగా తీసుకోకుండా పగడ్బందీగా వ్యవహరించి రానున్న రోజుల్లో తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత కార్యాలపర్తలపై ఉందని అన్నారు ఈ కార్యక్రమం నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ అధ్యక్షతన జరగగా అదిలాబాద్ పార్లమెంటు ఇంచార్జ్ ఆరెపల్లి మోహన్ టి పి సి సి కార్యదర్శి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు దుర్గాభవాని బిఎల్ఎ 2 లు ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఆగస్టు 3 వరకు తమను కలవడానికి వీలు లేదు అత్యవసర మైతే తప్ప




పార్టీ ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు

ముఖ్య నాయకులు గ్రామాల్లో ఉంటూ ఎస్ ఐ ఆర్ ప్రోగ్రాం పరిశీలించాలి

సామాన్య ప్రజలకు సమయం ఇస్తాం

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు వెడమ బొజ్జు పటేల్ వెల్లడి

**ఖానాపూర్ జూలై 23 (ప్రజా జ్యోతి)** నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు ముఖ్య నాయకులు ఆగస్టు 3 వరకు తమను కలవడానికి వీలు లేదని నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు బొజ్జు పటేల్ అన్నారు గురువారం సాయంత్రం ఖానాపూర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన బిఎల్ఎ టు ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న సందర్భంగా వివరించారు సామాన్య ప్రజలు తమను కలవచ్చని అయితే పార్టీలో బాధ్యతలు నిర్వహిస్తున్న వాళ్లు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎస్ ఐ ఆర్ (సర్) సర్వే ఓటర్ల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు బాధ్యతాయుతంగా ప్రతి గ్రామంలోనూ పట్టణాల్లో గల బూతుల వారిగా తిరిగి బిఎల్వోలు చెప్పిన ఓటర్ల సవరణ శాతం లెక్కల్లోకి తీసుకోకుండా ప్రత్యక్షంగా వాళ్లతో పాటు పాల్గొని ఒక బూతులో ఉన్న ఓట్లు ఎన్ని ఇప్పటివరకు సవరించడం ఓట్లు ఎన్ని మిగిలిన ఓట్లు ఎన్ని తిరిగి సవరించేవి ఎన్ని అనే దృక్పథంతో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులుగా నే కాకుండా జిల్లా పార్టీ అధ్యక్షులుగా జిల్లాలో గల అన్ని గ్రామాలతో పాటు పట్నాల్లోని బూతుల సరళికి సంబంధించిన విషయాలు తెలుసుకునేందుకు వెళ్లాల్సి వస్తుందని ముఖ్యమంత్రి ఆదేశానుసారం ఎవరు కూడా హైదరాబాద్ రాజధానిలో కనబడకుండా తమ తమ గ్రామాల్లోనే సర్ ప్రోగ్రాం సక్సెస్ అయ్యేలా చూడాలని ఎమ్మెల్యేలను మంత్రులను ముఖ్య జిల్లా నాయకులను ఆదేశించిన విషయాన్ని కార్యకర్తలకు వివరించారు ఇప్పటికే జిల్లా స్థాయిలో అధికారికంగా 70 నుంచి 100% పూర్తయినట్లు ప్రకటిస్తున్న వాటిని పునర్ పరిశీలించి బి ఎల్ ఎ టు లతో పాటు ముఖ్య కార్యకర్తలు సమన్వయంగా ఉండి ఏ బూతులు ఎన్ని పాములను బయటకు ఇచ్చారు తిరిగి సరైన పద్ధతిలో నింపి ఇచ్చారా మిగిలినవి ఎన్ని తెలుసుకొని ఆ ప్రాంతంలో అవసరమైతే ఇంటింటా తిరిగి ఓట్లు పూర్తి శాతం వాకబ్ చేయాల్సిన బాధ్యత ప్రతి పీఎల్ఎ టు తో పాటు ముఖ్య కార్యకర్తలపై ఉందని ఎమ్మెల్యే బొజ్జపటేల్ అన్నారు ఆయా పార్టీ నాయకులకు ఇచ్చిన బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వహించి సర్ ప్రోగ్రాంను విజయవంతం చేసి అసలైన ఓటర్లకు అన్యాయం జరక్కుండా చూడాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని తెలిపారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఖానాపూర్ కడెం పెంబి దస్తురాబాద్ నాలుగు మండలాలకు చెందిన బిఎల్ఎ టు లతోపాటు పార్టీ మండల పట్టణ గ్రామాల జిల్లా స్థాయి నాయకులతోపాటు ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్న ముఖ్య అతిథులు మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల చారి పార్లమెంట్ ఇన్చార్జి ఆరేపల్లి మోహన్ టి పి సి సి కార్యదర్శి ఏం బిటి రాజేశ్వర్ల సహకారం పట్ల ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అభినందించారు శాలువాలతో సత్కరించారు

# ప్రజల భద్రతే లక్ష్యం...
# నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి


మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్



**మంచిర్యాల, 23, జూలై (ప్రజా జ్యోతి):** ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతే లక్ష్యంగా నేరాల నియంత్రణకు ప్రతి వ్యాపార, వాణిజ్య సంస్థతో పాటు ప్రజలకు సేవలు అందించే అన్ని సంస్థల్లో నాణ్యమైన సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అని మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ అన్నారు.రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం మంచిర్యాల జోన్ పరిధిలోని మంచిర్యాల పట్టణంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో నగల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ, దొంగతనాలు, ఇతర నేరాల నివారణతో పాటు భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించేందుకు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్, ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌రావు, ఎస్ఐలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీసీపీ ఏ. భాస్కర్ మాట్లాడుతూ, మంచిర్యాల నగరం పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య పరంగా తెలంగాణలో కీలక కేంద్రంగా ఉందని తెలిపారు. మహారాష్ట్ర సరిహద్దుకు సమీపంలో ఉండటంతో పాటు రైల్వే మార్గం ద్వారా ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నందున భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో పోలీస్ కమిషనర్ నిర్వహించిన సమీక్షలో నగరంలోని పలు వ్యాపార సంస్థల్లో సీసీ కెమెరాల ఏర్పాటు తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం ప్రకారం ప్రతి వ్యాపార సంస్థ, ప్రజలకు సేవలు అందించే అన్ని సంస్థలు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భవనం లోపల, ముందు, వెనుక భాగాలతో పాటు రహదారులపై జరిగే కదలికలు కూడా స్పష్టంగా రికార్డు అయ్యే విధంగా కెమెరాలను అమర్చాలని సూచించారు. దీనివల్ల నేరాల నియంత్రణతో పాటు నేరస్థులను వేగంగా గుర్తించి పట్టుకోవడం సులభమవుతుందని అ న్నారు. ఇటీవలి కాలంలో నేరస్థులు ఆధునిక పద్ధతులను అనుసరిస్తున్న నేపథ్యంలో, ముఖ్యంగా రైల్వే మార్గాన్ని ఉపయోగించి నగరంలోకి వచ్చి నేరాలకు పాల్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఆర్మ్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మంచిర్యాల నగరంతో పాటు నస్పూర్, శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్ ప్రాంతాల్లో 24 గంటల పాటు పగలు, రాత్రి నిరంతర ఆర్మ్ పెట్రోలింగ్ కొనసాగుతోందన్నారు. అలాగే జాతీయ రహదారులపై కూడా ఆర్మ్ పెట్రోలింగ్‌ను మరింత బలోపేతం చేసినట్లు వెల్లడించారు. ప్రజల ప్రాణ, ఆస్తి భద్రత కోసం చేపడుతున్న ఈ చర్యలకు ప్రజలు సహకరించాలని, తమ వ్యాపార సంస్థలు, నివాసాలు, వాణిజ్య సముదాయాల్లో నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ విజ్ఞప్తి చేశారు

# రేపు జూలై 24న జరిగే విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయండి

### నీట్ పేపర్ లీకేజ్ కి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీ నామా చేయాలి

### ఢిల్లీలో విద్యార్థి యువతపై దాడి చేసిన పోలీసులపై స మగ్ర విచారణ చేయాలి ఏఐవైఎఫ్, జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్

**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 23, (ప్రజా జ్యోతి)** నీట్ పేపర్ లీకేజ్ కి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీ నామా చేయాలని, ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తె లుపుతున్న విద్యార్థి యువ తపై విచక్షణరహితంగా దాడి చేసిన పోలీసులను స స్పెండ్ చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చే యాలని జూలై 24న విద్యార్థి సంఘాలు తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌కు ఏఐ వైఎఫ్, డివైఎఫ్ఐ, పివైఎల్, ఎఐవైఫ్ఐ యువజన సంఘాలు సంపూర్ణ మద్దతు తె లియజేస్తున్నాయని, ఈ బంద్ కు విద్యార్థులు, ఉపా ధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, మేధావులు, యువత, ప్రజలు సహకరిం చాలని విజ్ఞప్తి చేశాయి. బంద్ ను జయప్రద చేయాలని గురువారం సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఏ ఐ వై ఎఫ్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ మాట్లాడు తూ నీట్ పేపర్ లీకేజీ కుం భకోణం వలన 21 మంది అమాయక విద్యార్థులు ఆ త్మహత్యలు చేసుకున్నారని, ఈ ఆత్మహత్యలకు కేంద్ర ప్ర భుత్వం బాధ్యత వ హించా లన్నారు. కేంద్ర ప్రభుత్వం వై ఫల్యం వల్లనే వరుసగా జా తీయస్థాయి ప్రమాణాలు కలిగిన పరీక్షల పేపర్లు లీకే జీలు అవుతున్నాయని, వి ద్యార్థులు నష్టపోతున్న ఇప్పటివరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందించక పోవడం సిగ్గుచేటు అన్నా రు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని గత కొన్ని రోజులుగా శాంతియు తంగా నిరసనలు తెలుపు తున్న విద్యార్థి, యువత ప ట్ల కేంద్ర ప్రభుత్వం నియం తృత్వ ధోరణితో వ్యవహ రించడం దుర్మార్గమని అన్నారు. శాంతియుతంగా జంతర్ మంతర్ నుండి పార్లమెంట్ మార్చ్ నిర్వహి స్తున్న విద్యార్థి,



యువతపై విచక్షణ రహితంగా కేంద్ర ప్ర భుత్వం పోలీసులచే లాఠీ చార్జీలు, భాష్ప వాయు గో ళాలు, వాటర్ కెనాన్లు ప్ర యోగించి ఇష్టానురీతంగా దాడులు చేసి తీవ్రంగా గా యపరచడం జరిగిందని అన్నారు. విద్యార్థి, యువత పై దాడికి పాల్పడిన పోలీ సు లపై విచారణ చేసి స స్పెండ్ చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ టె స్టింగ్ ఏజెన్సీని రద్దు చేయా లన్నారు. కేంద్ర ప్రభుత్వం త క్షణమే విద్యాశాఖ మంత్రి ధ ర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చే యించాలని అన్నారు. జూ లై 24న విద్యార్థి సంఘాలు నిర్వహించే విద్యాసంస్థల బంద్‌లో యువత,ప్రజలు మేధావులు, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు,ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు గేడం శశి, రాజు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షుడిగా అస్గర్



**లక్ష్మణ చాంద, జూలై 23 (ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులుగా మండల కేంద్రానికి చెందిన షేక్ అస్గర్ నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొండ్ర నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రోజున మైనారిటీ మండల అధ్యక్షున్ని ఘనంగా సన్మానించారు.మైనారిటీ మండల అధ్యక్షులు గా నియమించినందుకు నిర్మల్ నియోజకవర్గం ఇంచార్జి కుచాడి శ్రీహరి రావు కు అస్గర్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అల్లోల సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొండ్ర నరేష్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీం రెడ్డి,వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్,రఘు నందన్ రెడ్డి, రాం రెడ్డి,ఓస రాజేశ్వర్, కేశం రమేష్, గురాల లింగారెడ్డి, బిట్లింగు రజనీకాంత్ గణేష్, నారా గౌడ్, సిరాజ్, సంగం వెంకట్ రాజు,బూసి మహేష్, సుదర్శన్, వెంకట్,పసుపుల నరేష్,కల్లెడ భూమన్న,గంగయ్య, కాంగ్రెస్ పార్టీ కార్య కర్తలు పాల్గొన్నారు.

# జంతర్ మంతర్ ధర్నాలో అరెస్టయిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలి

-మండల కన్వీనర్ గాజుల పోతన్న.



**సోనాల, జూలై 23 ( ప్రజాజ్యోతి ):**సోనాల మండల కేంద్రంలో ఈరోజు మండల కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులను అక్రమం గా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ, వారిని వెంటనే ఎలాంటి నిబంధ నలు లేకుండా విడుదల చేయాలని కోరుతూ ఎమ్మార్వో మల్లేష్ గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కన్వీనర్ గాజుల పోతన్న మాట్లాడుతూ... విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల సాధనకై జంతర్ మంతర్ వద్ద ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతుంటే, పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడం దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు అనుచితమైన చర్యలు మానుకొని, అరెస్టు చేసిన విద్యార్థి నాయకులను, విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కసిరే పోతన్న గుడాల అనీష్ జంగాల భోజన్న మునేశ్వర్ సోమన్న భాషెట్టి సుదర్శన్ షేక్ మహమూద్ అమృత్ పాటిల్ లాలూ రామ్ శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# ఒక వ్యక్తికి ఒకే ఓటు

**ఎన్యుమరేషన్ ఫారాలు వెంటనే బీఎల్ఓలకు అందజేయాలి**

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 23, (ప్రజా జ్యోతి)** జిల్లాలో రెండు చోట్ల ఓటు హక్కు నమోదైన (డబుల్ ఓటర్లు) వారు వెంటనే ఒకే ప్రాంతంలో ఓటు కొనసాగించేలా నిర్ణయం తీసుకుని, మరో ప్రాంతంలోని ఓటును తొలగించేందుకు అవసర మైన ఎన్యుమరేషన్ ఫారాలను రెండు, మూడు రోజు ల్లోగా సంబంధిత బూత్ లెవల్ అధికారులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ అంశాలపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావే శంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ, ఒక వ్యక్తికి ఒకే చోట మాత్రమే ఓటు హక్కు ఉండాలని, రెండు చోట్ల ఓటు కొనసాగించడం ఎన్నికల చట్టానికి విరుద్ధమని స్పష్టం చేశారు. అర్బన్ లేదా గ్రామీణ ప్రాంతంలో ఎక్కడ ఓటు కొనసాగించాలను కుంటున్నారో సంబంధిత ఓటర్లు వెంటనే నిర్ణయం తీసుకోవాలని, ఈ అంశంపై రాజకీయ పార్టీలు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కో రారు. గత ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం జిల్లాలో ఓటరు జాబితాలో ఉన్న లోపాలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పెద్దగా సమస్యలు లేవని, మావల, ఆదిలాబాద్ అ ర్బన్ ప్రాంతాల్లో మాత్రమే కొన్ని స్వల్ప వ్యత్యాసాలు గు ర్తించినట్లు పేర్కొన్నారు. పో లింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా 2025 ఓటరు జాబితా ప్రకారం 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న కేంద్రా లను మాత్రమే పునర్వ్యవస్థీకరించే ప్రతిపాదన ఉందని తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రొఫార్మాలను ఇప్పటికే రాజకీయ పార్టీలకు అందజేశామని చెప్పారు. మరణించిన, చిరునా మా మారిన ఓట్ల తొలగింపు అనంతరం మిగిలే తుది ఓ టర్ల సంఖ్య ఆధారంగా అవ సరమైన చోట్ల మాత్రమే పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపడతా మని వివరించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో ఎన్యుమరేషన్ ప్రక్రియను వేగవంతం చేశామని, గుర్తించిన వ్యత్యాసాలను త్వరితగతిన పరిష్కరి స్తున్నామని తెలిపారు. ఎ న్యుమరేషన్ ఫారాల సమ ర్పణలో నిర్లక్ష్యం వహిస్తే ఎ న్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు. సమా వేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు, సందేహాలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఎన్నికల నిబంధనలకు అనుగు ణంగా వాటిని పరిశీ లించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్ ఎస్ చిత్రు, ఆర్డీఓ జగదీ శ్వరరావు, తహసీల్దార్ శ్రీని వాస్, ఎన్నికల విభాగం ప ర్యవేక్షకురాలు నలంద ప్రియ, వివిధ రాజకీయ పార్టీ ల ప్రతినిధులు రాకేష్, బండి దత్తాత్రేయ, గుడిపల్లి నగేష్, మహమ్మద్ జకరియా, దీపక్, ఆకుల రాము తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై లాఠీ చార్జీ అమానుషం. కేంద్ర ప్రభుత్వం దొంగ వైఖరి విడనాడాలి, రాహుల్ గాంధీ అరెస్ట్ ప్రజాస్వామీకం

**నీట్ పేపర్ లీకేజీ పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలి**

**కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ:**

**టిపిసిసి పిలుపు మేరకు సిర్పూర్(టి) లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా రాస్తా రోకో:**

**ముఖ్య అతిథులుగా పాల్గొన్న స్టేట్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విటల్,రాష్ట్ర జనరల్ సెక్రెటరీ అబ్దుల్ షకీల్:**



**జూలై 23, సిర్పూర్(టి) కాన్స్టెన్సీ,(క్రస్పాండెంట్ ప్రజాజ్యోతి:** నీట్ పేపర్ లీకేజీను నిరసిస్తూ దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు, యువత పాల్గొని శాంతి యుతంగా నిరసన తెలియజేస్తుండగా నిరుద్యోగులు,విద్యార్థు లు,యువతపై జరిగిన లాఠీచార్జి ను ఖండిస్తూ విద్యార్థులకు మద్దతుగా నిలిచిన రాహుల్ గాంధీ తో పాటు ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం అప్రజా స్వామ్యమని కేంద్ర ప్రభుత్వం అవలంబించిన విధానానికి నిరసనగా దేశవ్యాప్త నిరసనలో భాగంగా టిపిసిసి పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఈరోజుకొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) నియోజక వర్గంలోని కౌటాల, చింతల మానేపల్లి, బెజ్జూర్,కాగజ్నగర్, దహేగాం,పెంచికల్పేట్, మండలాలతో పాటు కాన్స్టెన్సీ హెడ్ కోటర్ సిర్పూర్(టి)లో భారీ ర్యాలీ,నిరసన,రాస్తారో కార్యక్రమానికి రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విటల్, కాంగ్రెస్ పార్టీ స్టేట్ జనరల్ సెక్రెటరీ అబ్దుల్ షకీల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్న అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతోపాటు కిలోమీటర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు ర్యాలీలో మోది డౌన్ డౌన్, ఈ ఘటనకు మోడీ బాధ్యత వహించాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నీ పేపర్ లీకేజీ పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని, కేంద్ర ప్రభుత్వ ద్వంద వైఖరి నశించాలని నినాదాలు చేస్తూ పేట్ మహిళా నుండి బస్టాండ్ చౌరస్తా చేరుకొని మెయిన్ రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండేవిటల్, ఎస్టేట్ జనరల్ సెక్రెటరీ అబ్దుల్ షకిల్, మండల నాయకులు కార్యకర్తలు కలిసి రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ.. కేంద్రంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ప్రతిపక్ష నాయకులను విద్యార్థులను,నిరుద్యోగుల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నా మని అన్నారు. నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలో నెట్టే విధంగా జరిగిన నీట్ పేపర్ లీ ఘటన బాధ్యులపై కఠిన చట్టారీత్యా చర్యలు తీసుకోవడం లో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జి చేయడంపై ఆగ్రహం తో మండిపడ్డారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై లాఠీ చార్జీ కు ఆదేశించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకుల పై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యార్థుల భవిష్యత్తులను దృష్టిలో ఉంచుకొని పారదర్శకమైన పరీక్ష విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంతోపాటు విద్యార్థుల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణ లో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చట్టరీత్య చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువ లను అణిచి వేసే విధం గా వ్యవహరిస్తుందని ఆరోపించారు. లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టులను, విద్యార్థుల పై జరిగిన లాఠీ చార్జ్ నాటి చార్జింగ్ ను ఖండించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని సూచించారు. ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ నాయకులు సీడం గణపతి, సిర్పూర్ (టి) మండల అధ్యక్షులు అబ్దుల్ అఖిల్, నాయకులు సోహెల్ అహ్మద్,చింతల సత్తయ్య,అమ్మినొద్దీన్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నాయకులు,సర్పంచ్ లు ఉప సర్పంచ్లు, కార్య కర్తలు,అదేవిధంగా అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్పంచులు ఉప సర్పంచ్లు కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చెయ్యడం సిగ్గు చేటు

**నీట్ పేపర్ లీక్ కేంద్ర ప్రభు త్వ వైఫల్యమే మాజీ ఎంపీ సోయం బాపూరావు**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 23, (ప్రజా జ్యోతి)** నీట్ పేపర్ లీకేజ్ కేంద్ర ప్రభుత్వం వైఫల్యమే నని, తీవ్రం గా నష్ట పోయిన విద్యార్థు లు, యువకులు రోడ్డు ఎక్కి ఆందోళన వ్యక్తం చేస్తే ఆ విద్యార్థులకు నచ్చ చెప్పేది పోయి వారి పై విచక్షణ రహితంగా లాఠీలు ఝుళిపించ డం సిగ్గు చేటు అని మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవా స మితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని బెల్సరీ రాంపూర్ గ్రామ పంచాయతీని ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్ గా తీసుకోని నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను మాజీ ఎంపీ మాజీ ఎమ్మెల్యే రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు బుధవారం పరిశీలించారు. అనంత రం అందర్ బంద్‌లో నూతనంగా నిర్మించాసున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం వీధి లైట్లను ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి సరైంది కాద ని, అమాయక విద్యార్థుల పై లాఠీ ఛార్జ్ చెయ్యడం స మంజసం కాదన్నారు. లోక్ సభ లో ప్రతి పక్ష నేత రాహుల్ గాంధీకి రక్తం వచ్చేలా లాఠీ చార్జి చెయ్యడం ఇది ప్రజా స్వామ్యమా అని ప్రశ్నించారు. ఆనాడు మణిపూర్ లో ఆదివాసుల పై లాఠీ చార్జిలు, ఈ రోజు విద్యార్థులపై లాఠీ చార్జీలు చె య్యడం సరైన పద్ధతి కాద న్నారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోడీ నిద్ర పోతు న్నారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీ నామా చెయ్యాలని డిమాండ్ చేశారు.